నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ పి. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదర్షాకోట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్‌నగర్, తిరుమల గార్డెన్, రాధా రిటపర్ట్స్ ఫేస్–2, పావనీ హార్మనీ విల్లాస్, బస్‌పన్ స్కూల్, పార్ట్ ఆఫ్ పద్మశ్రీహిల్స్ మెయిన్ రోడ్డు, స్నేహిత హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు స్నేహితహిల్స్ ఫేస్–1,2, మిలట్రీ–2 ఫీడర్ పరిధిలో 12 గంటల నుంచి 12.30 గంటల వరకు మపేల్ టౌన్, విశ్వాస్ టౌన్, పీఅండ్‌టీ కాలనీ ఫీడర్ పరిధిలో ఏ,బి,సి,డి, స్పెషల్ బ్లాక్స్, సన్‌సిటీ, కీర్తి రిచ్‌మండ్ విల్లాస్ తదితర ప్రాంతాల్లో మరమ్మత్తుల కారణంగా ఈ కోతలు విధిస్తున్నామన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: వివిధ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం కాటేదాన్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కాటేదాన్ విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 1 గంటల నుంచి 1.30 గంటల వరకు గంగోత్రి ఫీడర్ లేన్, గణేష్ నగర్, అమ్మగార్డెన్, పాయోనీర్ స్కూల్, బాబా టెంట్ హౌజ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన జీవితాన్ని జీవిస్తారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ శ్రీలతసురేష్‌గౌడ్ అన్నారు. 18వ డివిజన్‌లోని వివేకానంద కాలనీలో ఫ్రైడే – డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫ్రైడే– డ్రైడే కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఇంటితో పాటు పరిసరాలను ప్రతి శుక్రవారం శుభ్రం చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు భాస్కర్‌రావు, రమేష్, చెన్నారెడ్డి, శంకర్, నాగరాజురెడ్డి, బిల్ కలెక్టర్ రాజశేఖర్, నవీన్, యాదగిరి పాల్గొన్నారు.

బోనాల సందర్భంగా ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

శంషాబాద్: పట్టణంలోని వివిధ కాలనీలు, బస్తీలో ఈ నెల 21న నిర్వహించనున్న బోనాల పండగ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ఎం. శ్రీకాంత్ యాదవ్ పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేశారు. 22న వీకర్ సెక్షన్ కాలనీలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు. ఆలయాల వద్ద ఏర్పాట్లతో పాటు ఎక్కడ కూడా చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు. నీటి సరఫరా, వీధి దీపాల పనితీరును కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. బోనాల సందర్భంగా వార్డులో మౌలిక వసతులు మెరుగుపర్చాల్సిందిగా మున్సిపాలిటీ అధికారులను కోరారు.

జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు


జ్ఞానేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మంచిరేవుల ముదిరాజ్‌లు

మణికొండ: రాష్ట్ర ముదిరాజ్ కో ఆపరేటీవ్ సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బి.జ్ఞానేశ్వర్‌ను నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల, వట్టినాగులపల్లి గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘాల నాయకులు శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్‌ల కష్టసుఖాలపై సమగ్ర అవగాహన ఉన్న సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో ముదిరాజ్‌ల సంక్షేమానికి పూర్తి స్థాయిలో జ్ఞానేశ్వర్ పాటు పడతారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘాల నాయకులు శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీరాములు, శివరాజ్, శ్రీకాంత్, వెంకటేశ్, మల్లేష్, మణికాంత్, సతీష్, జంగయ్య, బిక్షపతి, మల్లేష్, అరుణ్‌కుమార్, సాయిరాం, సాయియాదవ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవంను విజయవంతం చేయాలి


మొక్కలను పంపిణీ చేసిన చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్‌లు

మణికొండ: మున్సిపల్ పరిధిలోని 6, 8, 10, 15 వార్డులలో శుక్రవారం కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో కలిసి నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరు వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటి వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పత్తి శ్రీకాంత్‌రావు, పత్తి ప్రవీణ్‌కుమార్, లంకల పద్మవీరారెడ్డి, డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితునికి జైలు, జరిమానా


బ్రహ్మ ఆలియాస్ బ్రహ్మేంద్ర వరప్రసాద్

రాజేంద్రనగర్: లైంగిక దాడి కేసులో రాజేంద్రనగర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.ఆంజనేయులు పదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారాన్ని అందించాలని తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రహ్మణ్‌వాడీ ప్రాంతానికి చెందిన బ్రహ్మ ఆలియాస్ బ్రహ్మేంద్ర వరప్రసాద్ ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. 2018 జనవరి 4న అదే ప్రాంతంలోని ఓ మైనర్ బాలిక ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలన్నింటిని పరిశీలించి న్యాయమూర్తి ఆంజనేయులు తీర్పునిచ్చారు.

కోట మైసమ్మ ఆలయంలో శాకంబరి పూజలు




శాకంబరి అలంకరణలో కోట మైసమ్మ అమ్మవారు

రాజేంద్రనగర్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా బుద్వేల్‌లోని కోట మైసమ్మ దేవాయలంలో శుక్రవారం శాకంబరి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నూట ఒక్క రకాల పూలు, పండ్లు, కూరగాయలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. తెల్లవారుజామున అభిషేకం అనంతరం అమ్మవారిని శాకంబరి అమ్మవారుగా అలంకరించారు. అమ్మవారితో పాటు దేవాలయాన్ని పండ్లు, కూరగాయలతో అందంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బుద్వేల్‌తో పాటు రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమంలో పలువురు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు


సబితా ఇంద్రారెడ్డిని కలిసిన రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొలన్ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మారిన రాజకీయ సమీకరణాల దృష్ట్యా పార్టీ బలోపేతానికి, పార్టీలో ఉన్న క్యాడర్ మనోధైర్యాన్ని నింపేందుకు తదితర విషయాలపై చర్చించడం జరిగిందన్నారు. భవిష్యత్తు ఆశా కిరణం యువ నాయకులు కార్తీక్ రెడ్డి నాయకత్వమే మాకు శ్రీరామరక్ష అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డి.రమేశ్ ముదిరాజ్, పచ్చ శ్రీనివాసులు, మాజీ కార్పొరేటర్ జంగన్న, వీర్లపల్లి నవీన్, ఉమారెడ్డి, డి.వినాయక ప్రీతం, అక్కిరాజు, సుబ్బారావు, బి.భానుప్రకాష్, కె.రవీందర్, కె.శ్రావణ్, ఎం.నరేశ్ యాదవ్, బీటీ శ్రీనివాస్, పి.కృష్ణ, గౌతమ్, డి.రాజేశ్ కుమార్, దేవదాస్, శ్రీవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణికొండ సమస్యలు తీర్చండి


సమస్యలను ఉపముఖ్యమంత్రికి వివరించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్

మణికొండ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 50 పడకల ఏరియా ఆసుపత్రి, 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, జూనియర్ కళాశాల, అగ్నిమాపక కేంద్రం మంజూరు చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరారు. శుక్రవారం ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం. జితేందర్ కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్ళారు. నెక్నాంపూర్ చెరువు అభివృద్ధి పనులు అర్థాంతరంగా నిలిచిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కుంటున్నారని, మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని కోరామన్నారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు జితేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

పార్కు పనులను త్వరగా పూర్తి చేయాలి


లక్ష్మీనగర్ పార్కు పనులను పరిశీలిస్తున్న వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ పార్కును శుక్రవారం వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి పరిశీలించారు. ల్యాంకోహిల్స్ పక్కన స్టేడియం నిర్మాణం, పోచమ్మ దేవాలయం వద్ద బోనాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీనగర్ కాలనీలో సుందరమైన పార్కును అభివృద్ధి చేస్తున్నామన్నారు. పనులను ఆలస్యం చేస్తున్నారని, త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో పేర్కొన్నారు. ఈ నెల 28న పోచమ్మ బోనాలకు అవసరమైన అన్నీ రకాల ఏర్పాట్లను చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సంజీవరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, నాయకులు రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణకు పిచికారీ


డ్రోన్‌తో పిచికారీ చేస్తున్న సిబ్బంది

రాజేంద్రనగర్: దోమల నివారణ పై చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన మూసీనదిలో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ ఆధ్వర్యంలో యాంటీ లార్వా మందులను డ్రోన్ ద్వారా పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన రవి కుమార్ మాట్లాడుతూ.. దోమల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ఆవరణను పరిశుభ్రంగా పెట్టుకోవాలని, జీహెచ్‌ఎంసీ అధికారులకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మేడం మధు, లక్ష్మీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు షిరి నవీన్, దాసరి భాస్కర్, ఎంటమాలజీ విభాగం అధికారి నామాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దిలీప్‌పాండే


దిలీప్‌పాండేకు ఎయిర్‌పోర్టులో స్వాగతంపలుకుతున్న దృశ్యం

శంషాబాద్: ప్రతిపక్ష పార్టీలపై దేశవ్యాప్తంగా బీజేపీ ప్రతికార రాజకీయాలు చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి, ఎమ్మెల్యే ఢిల్లీ అసెంబ్లీ చీఫ్‌విప్ దిలీప్ పాండే అన్నారు. రాష్ట్ర ఇన్‌చార్జిగా నియమితులైన ఆయన శుక్రవారం సాయత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాములు గౌడ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలు ఆయనకు శంషాబాద్ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా వేగంగా ఎదుగుతోన్న ఆప్‌పై ప్రధాని నరేంద్ర మోదీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సాక్ష్యాలు లేని కేసులో ఆప్ జాతీయ అధ్యక్షుడు కేజ్రీవాల్ జైల్లో పెట్టి ఢిల్లీ సర్కారును బర్తరఫ్ చేయాలని, చేసేందుకు కేంద్ర సర్కారు కుట్ర చేస్తోందన్నారు. ఈడీ, సీబీఐ దాడులతో దేశంలో నిజాయితీ రాజకీయాలను ఆపివేయాలని బీజేపీ యత్నిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆప్‌ను సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కార్యచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. పార్టీ నేతలు నర్సింగ్, యమునాగౌడ్, జావీద్ షరీఫ్, రమేష్, పవార్, సోహైల్, ఎస్.ఎస్. రెడ్డి, శివాజి తదితరులున్నారు.

రుణమాఫీతో రైతులకు మేలు


వట్టినాగులపల్లిలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేసిన నాయకులు

మణికొండ: రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీతో ఎంతో మేలు జరుగుతుందని నార్సింగి మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్, గొలిదొడ్డి కౌన్సిలర్ డి.రేఖయాదగిరి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసిన ఘనత దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి దక్కగా అదే ఘనత తిరిగి ప్రస్తుత సీఎంకి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌కుమార్, శేఖర్, తారాసింగ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేతలు


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

రాజేంద్రనగర్: అనుమతులు లేని నిర్మాణాలను కూల్చివేయడం జరిగిందని రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ ఖాదర్ వెల్లడించారు. శుక్రవారం ఆరాంఘర్ కాటేదాన్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిర్మాణదారులు తప్పనిసరిగా జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ అనుమతులను ఆన్‌లైన్ ద్వారా అందిస్తుందని, ఇందులో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. అక్రమ నిర్మాణాలను తమ సిబ్బంది ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నోటీసులను అందిస్తున్నట్లు వెల్లడించారు. అయినప్పటికీ స్పందించక అలాగే నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిపై చర్యలు తప్పవన్నారు. ఉప కమిషనర్ రవి కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం మొత్తం తొమ్మిది నిర్మాణాలను కూలివేసినట్లు వెల్లడించారు.

కరెంటు కష్టాలు లేకుండా చూడాలి


విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న మాజీ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు కరెంటు కష్టాలు లేకుండా చూడాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ విద్యుత్ అధికారులను కోరారు. శుక్రవారం 22వ డివిజన్‌లోని యాదవ మిత్ర కాలనీ, భారతీనగర్, వినాయక్‌నగర్ కాలనీ, గాయత్రీనగర్, ఆదర్శనగర్ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై విద్యుత్ ఏఈకి సమాచారం అందించి, వెంటనే లైన్‌మెన్‌తో సమస్యపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచు విద్యుత్ కోతలు సంభవిస్తున్నాయని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ సమస్యను, ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ సత్తా చాటుదాం


సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం పార్టీ నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ మాట్లాడుతూ.. పార్టీ నుంచి కొందరు స్వార్థపరులు మాత్రమే పోయారని, పార్టీ క్యాడర్, అభిమానులు పటిష్టంగా ఉన్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థలతో పాటు అన్ని ఎన్నికల్లోను బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చూపించేలా కృషి చేయాలని తీర్మాణించారు. త్వరలోనే మున్సిపాలిటీ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమావేశం ఏర్పాటు చేస్తామని అందుకు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని వారు పేర్కొన్నారు. కౌన్సిలర్‌లు వసంతరావు, నవీన్‌కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు సీతారాం, లక్ష్మయ్య, డి.నర్సింగ్‌రావు, ఎ.లక్ష్మన్‌రావు, రాజేంద్రప్రసాద్, బాల్‌రెడ్డి, శ్రీకాంత్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, షేక్ ఆరీఫ్, రామసుబ్బారెడ్డి, లతాగౌడ్, సురేఖ, విజయలక్ష్మి, శ్రీనాథ్, దిలిప్‌కుమార్ పాల్గొన్నారు.

బోనాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి


పల్లెచెరువు దేవాలయంలో స్థానికులతో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాబోవు బోనాల ఉత్సవాలలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకుండా తగిన ఏర్పాట్లు చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి దుర్గామాత ఆలయం, ఆర్‌జీకే, లక్ష్మిగూడా మైసమ్మదేవాలయం, పల్లెచెరువు పోచమ్మ దేవాలయాలలో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు అన్ని దేవాలయాలలో తగిన మౌళిక వసతులను ఏర్పట్లు చేస్తున్నానని కార్పొరేటర్ తెలిపారు. ఇప్పటి వరకు అన్నీ దేవాలయాల సమీపంలోని ప్యాచ్ వర్కులు, సీసీ రోడ్ల పనులు పూర్తి చేశామని అన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గుంతలను పూడ్చి వేయడం జరిగిందని అన్నారు. అలాగే ఆలయాల వద్ద స్ట్రీట్ లైట్లు, సానిటేషన్ పనులను వేగవంతం చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భాను, హరీష్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ సురేందర్, బలరామకృష్ణ భక్త భజన మండలి సభ్యులు అక్కెం కృష్ణ, ముదిరాజ్, రావుల భాస్కర్, అడికె జనార్ధన్, అక్కెం చిన్నా, పాండు యాదవ్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శభాష్ ట్రాఫిక్ పోలీస్



మైలార్‌దేవ్‌పల్లి: దుర్గానగర్ చౌరస్తాలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం తమ విధులను నిర్వహించారు. ఈ సమయంలో అటుగా వెళ్తున్న రెడిమిక్స్ వాహనంలో మిగిలి ఉన్న సిమెంట్ కాంక్రిట్‌ను గుంతలో వేయాలని కోరగా.. ఆ వాహనదారుడు కాంక్రిట్‌ను గుంతలో వేశాడు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు తప్పని పరిస్థితుల్లో పారను చేత పట్టి, గుంతలో వేసిన కాంక్రిట్‌ను ట్రాఫిక్ పోలీసులు లేవల్ చేశారు. వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా రోడ్లపై గుంతలను ట్రాఫిక్ పోలీసులు పూడ్చడంతో వాహనదారులు శభాష్ అంటూ వెళ్లారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోంది


సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టిల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

శంషాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని కాంగ్రెస్ సర్కారు అమలు చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. రుణమాఫీ అమలైన సందర్భంగా శుక్రవారం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్ర పటాలకు కాంగ్రెస్ పార్టీ నేతలు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటోందన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేమని ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. రుణమాఫీతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. నాయకులు శంషుద్దీన్, మైలారం సులోచన, బొబ్బిలి కిష్టయ్య, కుమార్, లింగం యాదవ్, గని, నజీర్, నజీరుద్దీన్, అఫ్రోజ్, ఉమా మహేష్, జగన్, యాదగిరి, సత్యనారాయణ, దయానంద్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

కారు ఢీ కొనడంతో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



రాజేంద్రనగర్: అదుపుతప్పి ఓ కారు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాద సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బుద్వేల్ ప్రాంతానికి చెందిన వారు తమ కారులో శుక్రవారం మధ్యాహ్నం బుద్వేల్ మీదుగా వెళ్తుండగా ఘటన జరిగింది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ పంపు వద్దకు రాగానే రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టారు. దీంతో కారు వేగానికి స్తంభం కాస్తా ఐదు అడుగుల దూరం పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్ బ్యాగ్‌లో ఓపెన్ కావడంతో డ్రైవర్‌తో పాటు ముందు సీటులో ఉన్న వ్యక్తి సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది స్థలానికి చేరుకొని మరమ్మతులు ప్రారంభించారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి


మాట్లాడుతున్న జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ సహాయాధికారి సూర్యారావు

శంషాబాద్: మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడంతో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా పేదర నిర్మూలన సంస్థ సహాయ అధికారి సూర్యారావు సూచించారు. డీఆర్‌డీఏ, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో వీఏఓలు పాల్గొన్నారు. దేశంలో అతిపెద్ద నేరాల్లో మానవ అక్రమ రవాణా ఒకటన్నారు. పేదరికం, నిరక్షరాస్యతతో పాటు ఇతర అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరి నేరగాళ్లు ఆకృత్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడ చోటు చేసుకున్నా సత్వరమే సమాచారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ ప్రతినిధులు, ఏపీఎం అహల్య తదితరులు పాల్గొన్నారు.